సేవలకు సలాం




నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు చేతుల మీదుగా సేవా వజ్ర పురస్కారాలు అందుకుంటున్న వలంటీర్లు పి.శాంతి, ఎం.సతీష్

- ఉత్తమ వార్డు వలంటీర్లకు పురస్కారాలు
- ‘ఉత్తర’లో 1,535 మందికి ప్రదానం
- ఐదుగురికి సేవా వజ్ర..
- 18 మందికి సేవా రత్న..
- 1,512 మందికి సేవా మిత్రా అవార్డులు

సీతంపేట: ప్రజలకు – ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్న వార్డు వలంటీర్లకు ప్రభుత్వ గుర్తింపు లభించింది. ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతోపాటు నగదు పురస్కారాలను ప్రకటించింది. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటైన తర్వాత వరుసగా మూడో ఏడాది వలంటీర్లకు వందనం పేరిట పురస్కారాలు ప్రకటించంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పేరిట మూడు కేటగిరీల్లో ఎంపికైన వారికి రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు వలంటీర్ల బ్యాంకు ఖాతాలో జమకానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో శుక్రవారం అవార్డుల ప్రదానోత్సవాలన్ని లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పది రోజుల పాటు జరిగే ఈ పురస్కారాల కార్యక్రమంలో వలంటీర్ల ఖాతాలో నగదు ప్రోత్సాహకాలు జమచేస్తారు. దీంతోపాటు ఉత్తమ వలంటీర్‌గా ఎంపికైన వారికి ప్రశంసాపత్రం, బ్యాడ్జి, శాలువాతో సత్కరించనున్నారు. గడిచిన ఏడాది కాలంలో వలంటీర్లు చూపిన పనితీరే ప్రామాణికంగా పురస్కారాలకు ఎంపిక చేశారు.

ఉత్తర నుంచి ఎంపికైనవారు..

ఉత్తర నియోజకవర్గంలోని 17 వార్డులకు సంబంధించి జోన్–3 పరిధిలో 398 మంది వలంటీర్లు, జోన్–5 పరిధిలో 1,294 మంది మొత్తంగా 1,692 మంది వలంటీర్లు సేవలందిస్తున్నారు. వీరిలో ఐదుగురికి సేవా వజ్ర, 18 మందికి సేవా రత్న, 1,512 మందికి సేవా మిత్ర మొత్తంగా మూడు కేటగిరీల నుంచి 1,535 మంది పురస్కారాలకు ఎంపికయ్యారు. ఎం.సతీష్(జోగారావునగర్), టి.శాంతి(తాటిచెట్లపాలెం), వి.అరుణదేవి (సీతంపేట), కె.దుర్గాదేవి(వుడా కాలనీ), బి.గంగాభవాని(శాంతినగర్) సేవా వజ్ర పురస్కారాలకు ఎంపికయ్యారు. కలెక్టర్ ఎ.మల్లికార్జున, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా శుక్రవారం వీఎంఆర్‌డీ చిల్డ్రన్ థియేటర్‌లో వీరంతా పురస్కారాలు అందుకున్నారు. తమ సేవలకు ప్రభుత్వ గుర్తింపు లభించడంతో వలంటీర్లంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పురస్కారంతో బాధ్యత పెరిగింది



44వ వార్డు అబిడ్‌నగర్–01 సచివాలయ పరిధిలో వలంటీర్‌గా సేవలందిస్తున్నాను. సేవా మిత్ర పురస్కారానికి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది. వచ్చేసారి సేవా రత్న పురస్కారం పొందేలా కృషి చేస్తాను.

– టి.ధరణి, సేవా మిత్ర అవార్డు గ్రహీత

సేవలకు గుర్తింపు లభించింది



43వ వార్డు వెంకటేశ్వర కాలనీ–02 సచివాలయం పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్నాను. ఏడాది కాలంగా అందించిన సేవలకు గుర్తింపుగా సేవా రత్న అవార్డుకు ఎంపికయ్యాను. భవిష్యత్‌లో మరింత మెరుగైన పనితీరు చూపించి సేవా వజ్ర పురస్కారం అందుకుంటాను.

– డి.సంతోషి, సేవా రత్న అవార్డు గ్రహీత

సమస్యల పరిష్కారానికే ‘గడప గడపకు..’



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 54వ వార్డు దుర్గానగర్–3, వివేకానంద వీధి, బాపూజీనగర్, శ్రీనగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ఆయన వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని నివాసులకు వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా ముఖ్యమంత్రి జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర చల్లా రజని, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఆయా వార్డుల కార్పొరేటర్లు, వార్డు నాయకులు ఈశ్వరరావు, చిరంజీవి, రమణమ్మ, రత్నాకర్, శ్రీను, సోమేష్, రాంబాబు, నమ్మి శంకర్, ప్రసాద్, నాగరాజు, దిలీప్, రాధాకృష్ణ, దివాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు చిత్రలేఖనం పోటీలు

మురళీనగర్: ఏపీ పొల్యూషన్ బోర్డు ఆధ్వర్యంలో టీమ్ సీటీజీ వైజాగ్ సౌజన్యంతో శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్–1లో 10 ఏళ్లలోపు, గ్రూప్–2లో 11–15 ఏళ్లలోపు, గ్రూప్–3లో కాలేజీ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. మురళీనగర్ వార్మ కాంప్లెక్స్ సమీంపలోని జీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. ప్లాస్టిక్ పొల్యూషన్ కంట్రోల్, ఇన్విరాన్‌మెంట్ బయోడైవర్సిటీ, బీచ్ క్లీన్ అప్ వంటి అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. వివరాలకు 85008 74103 నంబర్‌లో సంప్రదించి. పేర్లు నమోదు చేసుకోవచ్చు.

అభివృద్ధి పనులు ప్రారంభం



14వ వార్డులో పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని రూ.6 లక్షలతో కల్వర్టు పనులు, నరసింహనగర్‌లోని రూ.15,30,000 సామాజిక భవనం ఇంటర్నల్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ శ్రీరామ్మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, నాయకులు జగన్నాథ్ రెడ్డి, బల్ల శ్రీను, సుశీల పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మర్రిపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ నుంచి చినముషిడివాడ వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీకొనడంతో మహిళకు గాయాలయిన ఘటన శుక్రవారం జరిగింది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా.. రైల్వే స్టేషన్ నుంచి లక్ష్మి అనే మహిళ మరో మహిళతో కలిసి చినముషిడివాడకు వెళ్తున్న క్రమంలో అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఓ కారు ఢీ కొనడంతో లక్ష్మి ఒక్కసారిగా ఆటో నుంచి కిందకు పడిపోయారు. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. ఆటో కూడా దెబ్బతినడంతో డ్రైవర్ బండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లలితా పీఠంలో ప్రత్యంగిరా హోమం

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం ఉదయం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేదమంత్రాల నడుమ హోమం శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు పాల్గొని పూజలు చేసారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు ప్రతి అమావాస్య రోజూ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శత్రు నాశనం, ఆర్థిక ఇబ్బందులు తొలగేందుకు, కోర్టు కేసుల్లో విజయం, ఉద్యోగ అభివృద్ధి విషయంలో శుభఫలితాల కోసం ఈ హోమం చేసినట్టు చెప్పారు.

ధ్యాన మందిరంలో జబర్దస్త్ సత్తిపండు



జబర్దస్త్ సత్తిపండును సత్కరిస్తున్న ధ్యాన మందిర కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో బాబాను శుక్రవారం జబర్దస్త్ సత్యనారాయణ(సత్తిపండు) దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసారు. అనంతరం మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు సత్తిపండుకు బాబా చిత్రపటం అందించి శాలువాతో సత్కరించారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన జ్వాల



ఊర్వశి జంక్షన్ హైవేపై మానవ హారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పార్టీ నాయకులతో కలిసి నిరసన తెలుపుతున్న కె.కె.రాజు

కంచరపాలెం: విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల పర్యటనల్లో టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఊర్వశి జంక్షన్ జాతీయ రహదారిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవ హారం చేపట్టారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గూడు లేని పేదలందరికీ సొంతిళ్లు కల్పించాలనే సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలతోపాటు ఇళ్లు నిర్మించి అందించే కార్యక్రమం చేపట్టారన్నారు. అంతేకాకుండా అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి నిర్ణయించారని చెప్పారు. ఇటువంటి మంచి కార్యక్రమాలను చేపడుతుంటే ఓర్వలేని ప్రతిపక్ష నేత చంద్రబాబు పేద, బలహీన వర్గాల ప్రజలను కించపరిచేలా మీకిచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోతుందంటూ చేసిన వాఖ్యలు దుర్మార్గమన్నారు. బేషరతుగా రాష్ట్ర ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీను, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, అల్లు శంకరరావు, కార్పొరేటర్లు అనిల్ కుమార్‌రాజు, బర్కర్ అలీ, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజని, శశికళ, కో ఆప్షన్ సభ్యుడు ఎస్.అప్పారావు, మాజీ కార్పొరేటర్లు కొల్లాబత్తుల వెంగళరావు, జగదీష్, సత్యనారాయణ, పార్టీ వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, రత్నాకర్, కర్రి రామారెడ్డి, రాష్ట్ర నాయకులు కిరణ్‌రాజు, జోనల్ ఇన్‌చార్జిలు సునీల్, తుళ్లి చంద్రశేఖర్, రాష్ట్ర డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే



తుళ్లి చంద్రశేఖర్ యాదవ్

మర్రిపాలెం: ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన ప్రతిపక్ష నేత చంద్రబాబు తక్షణం క్షమాపణలు చెప్పాలని విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ తుళ్లి చంద్రశేఖర్ యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన నోరు అదుపులో పెట్టుకోకపోతే ఉత్తరాంధ్రలోని బడుగు బలహీన, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు రోడ్డు ఎక్కనివ్వకుండా ఇంటికి పరిమితం చేస్తారన్నారు. ఎవరికైనా ఇల్లు అంటే దేవాలయం లాంటిదని, ఎకరాల స్థలాలను మీకులా దోచుకుని కట్టేది కాదని, సమాధులతో పోల్చడానికి నోరు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఎలక్షన్ మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పి.. ఆ ప్రకారమే అందించారని చెప్పారు. తక్షణం క్షమాపణ చెప్పకపోతే తెలుగు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

క్రీడలతో చిన్నారులకు మేలు



చిన్నారుల కరాటే శిక్షణను తిలకిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. వార్డులోని ఈస్ట్ పార్కులో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. విశాఖ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ కోచ్ ఎల్లారావు పిల్లలకు కరాటే, బాక్సింగ్ తదితర క్రీడలను నేర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ పిల్లలు క్రీడలు ఆడటం వల్ల ఎంతో మేలు జరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు పలు క్రీడల గురించి వివరించారు. 289 సచివాలయం సెక్రటరీ భవాని, శానిటరీ సెక్రటరీ జోసఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పొన్నాడ అప్పారావు, జగన్, శ్యామ్, గణేష్, వినోద్, విశాఖ స్పోర్ట్స్ అసోసియేషన్ చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థుల ఎంపిక



క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుంజే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. కళాశాల నుంచి 18 మంది బాలికలు క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనగా.. 9 మంది ఉద్యోగాలు సాధించారు. వీరు జూలై 1న ఉద్యోగాల్లో జాయిన్ అవుతారు. కెమికల్ ఇంజినీరింగ్, ఆయిల్ టెక్నాలజీ నుంచి ముగ్గురు చొప్పున, ఇతర బ్రాంచిల నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. వీరికి రూ.3.6లక్షల వార్షిక వేతనాన్ని కంపెనీ ఆఫర్ చేసినట్లు గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. బుంజే కంపెనీ హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ ఎ.దక్షిణామూర్తి, మేనేజర్లు ఎస్.శ్రీరామిరెడ్డి, అనీష్ జోషి పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు, కంపెనీ ప్రతినిధులు గైస్ లోగో వద్ద సెల్ఫీ దిగారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

మర్రిపాలెం: కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం మాధవధారలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకులు సనపల ఆంజనేయులు, సనపల అమ్ములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథి పార్టీ కంచరపాలెం జోన్ కార్యదర్శి బి.పద్మ మాట్లాడుతూ సుందరయ్య బాటలోనే ప్రతి ఒక్కరు నడవాలని ఆమె పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకుడు కూన వెంకటరావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

త్వరలోనే డ్రెయిన్ పనుల పూర్తి



డ్రెయిన్ సమస్యను తెలుసుకుంటున్న జెడ్సీ కృష్ణ, కార్పొరేటర్ బర్కత్ అలీ

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్‌లో అధ్వానంగా ఉన్న డ్రెయిన్లను శుక్రవారం జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి పరిశీలించారు. ఈ సమస్యను గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నివాసులు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జోన్–5 కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించి తక్షణం పరిష్కరించాలన్నారు. ఈ నెల 24న పలు అభివృద్ధి పనులకు టెండర్లు పిలవాల్సి ఉందని, వాటిలో భాగంగా పూర్తి చేస్తామని జెడ్సీ హామీ ఇచ్చారు.

అనాథ బాలుర ఆశ్రమంలో అన్నదానం



అనాథాశ్రమం ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న ఇందిరా దేవి

మురళీనగర్: మహిళా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు అల్లూరి ఇందిరాదేవి ఆస్ట్రేలియాలో ఉన్న తన మనమడు దేవ్ రువిక్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. సెక్టర్–6 మురళీనగర్‌లోని జనరేషన్ యువ అనాథ బాలుర ఆశ్రమంలో మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. చెక్కు రూపంలో ఆర్థిక సాయం అందజేశారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషమణి, సనపల పుష్పలత, సహాయ కార్యదర్శి జయశ్రీ, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ జి.లక్ష్మి, సూపర్ వైజర్ మణికంఠ పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కొత్తలంక సుధ(టెక్నికల్) మాట్లాడుతూ సుమారు 09 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 467 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. 232 మంది అభ్యర్థులు పాల్గొనగా.. 115 మంది ఎంపికైనట్లు వారు తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. సహాయ సంచాలకులు జె.మాధవి, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు

డాబాగార్డెన్స్: స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా.. భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 81878 97569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నెంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారా పై అధికారులకు నివేదించి, సమస్యపై సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్–2 నుంచి రెండు, జోన్–3, 4, 5 నుంచి ఒక్కో ఫిర్యాదు వచ్చాయి. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్



సీతమ్మధారలో ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



కంచరపాలెం రైతుబజార్ సమీపంలో షాపులను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధిలోని పలు వార్డుల్లో ఆక్రమణలపై జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు టీపీఎస్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎంవీపీ కాలనీ, రైతుబజార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ప్రసాద్ సహకారంతో ఫుట్‌పాత్‌లో ఆక్రమణలు తొలగించారు. సీతమ్మధార, సీతంపేట, గురుద్వారా, హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం ప్రాంతాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీకొట్ల తొలగింపు చర్యలు చేపట్టారు. వాల్‌పోస్టర్లను తొలగించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ కొత్తగా పోస్టర్లు అతికిస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా..

మర్రిపాలెం: ట్రాఫిక్‌కు, పాదచారులకు అంతరాయం కలిగిస్తూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి పోలీసులు అడ్డుకట్ట వేశారు. కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ వరకు ఉన్న ఫుట్‌పాత్‌లు, కంచరపాలెం రైతుబజార్ రోడ్డు, జాతీయ రహదారిపై తాటిచెట్లపాలెం నుంచి బర్మాక్యాంప్ వరకు సర్వీస్ రోడ్డులో ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన దుకాణాలను శుక్రవారం కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. పాదచారులు, వాహనదారులు వెళ్లేందుకు వీలు లేకుండా ఈ రోడ్లు ఉండటంతో స్థానికులు ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఎస్ఐ పాపారావు హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావుతో కలిసి ఈ డ్రైవ్ చేపట్టినట్టు సీఐ తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్డుకు అడ్డంగా ఉన్న తోపుడు బళ్లు, వాహనాలపై కేసులు నమోదు చేసి జరిమానా విధించామని చెప్పారు.

వాటర్ ఫిల్టర్ వితరణ



తహసీల్దార్ కార్యాలయంలో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

సీతమ్మధార: సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి ఆప్ సబ్ కి అవాజ్ సంస్థ వాటర్ ఫిల్టర్ మిషన్‌ను వితరణగా అందజేసింది. శుక్రవారం దీనిని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు తాగునీటి సౌకర్యార్థం సంస్థ వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మొల్లి అప్పారావు, తహసీల్దార్ పి.శ్యామ్‌ప్రసాద్, డీటీ చేతన్‌కుమార్, ఆర్ఐ రవికృష్ణ, సంస్థ ప్రెసిడెంట్ వడ్లమూడి శివ, సెక్రటరీ బి.కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ కె.భాస్కర్, కోశాధికారి జోగేంద్ర సాయి, సభ్యులు బాలాజీ, వైజాగ్ బ్లడ్ డోనర్ క్లబ్ ప్రెసిడెంట్ రవి, రాజ్‌కుమారి, తాహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్లాస్ పెయింటింగ్‌లో విద్యార్థులకు శిక్షణ



పెయింటింగ్స్ చూపుతున్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు గ్లాస్ పెయింటింగ్‌లో శిక్షణ ఇచ్చారు. మన ఇంట్లో లభించే గ్లాస్ వస్తువులను పెయింటింగ్ వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దే మెళకువలను రిసోర్స్ పర్సన్స్ కె.భానుమతి, జి.షీలారాణి, ఆర్.స్నేహలత విద్యార్థులకు నేర్పించారు. సుమారు 25 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యంపై గ్రంథాలయ అధికారి వై.పద్మజ మాట్లాడారు. ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు, జామి అన్నాజీ రావు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు గ్రంథాలయ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన క్విజ్ పోటీ ఆసక్తికరంగా సాగింది. 70 మంది విద్యార్థులు గ్రూపులుగా పోటీలో పాల్గొన్నారు. సమకాలీన అంశాలు, చరిత్ర, జాతీయ ఉద్యమం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక, రాజనీతి, భూగోళ శాస్త్రాలు మొదలైన విషయాలపై 70 ప్రశ్నలు అడిగారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. విజేతలకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు.